క్లుప్తంగా

పని గంటలు తగ్గించాలి

పాకాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పని గంటలు తగ్గించి కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటీయు జిల్లా నాయకులు మధుసూదన్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సంతగేటు ఆటో స్టాండ్ వద్ద సీఐటీయూ కార్గవర్గ సమావేశం కేశవాచారి అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం పెంచకుండా 8 నుంచి 13 గంటల వరకు పని చేయాలని ఆదేశాలు జారీ చేయడం దుర్మార్గమని, కార్మిక కోడ్లను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చి కార్మికుల జీవితాలను బుగ్గిపాలు చేస్తోందని విమర్శించారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు, సంఘమిత్రలకు చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు మురళి, ఆనంద్, శేఖర్, నరేంద్ర, మోహన్‌బాబు, వెంకట్రమణ తదితరులు పాల్గొన్నారు.

శక్తిపీఠంలో ముత్యాలమ్మ జాతర


విశేష అలంకరణలో ముత్యాలమ్మ

రామచంద్రాపురం: మహాలయ అమావాస్య సందర్భంగా ఆదివారం మండలంలోని రాయలచెరువు సమీపంలోని శ్రీ శక్తిపీఠం ఆవరణలో ముత్యాలమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. కుర్తాళం పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానందభారతి, శక్తిపీఠాధీశ్వరి శ్రీ రమ్యానందభారతి ఆధ్వర్యంలో జాతర ప్రారంభమైంది. ఈ సందర్భంగా దేవీకి 108 కూష్మాండ బలి, 108 కిలోల తీపి పొంగలి, పులిహోర, దద్ధోజనం సమర్పించారు. మహా ప్రత్యంగిరా హోమం, శాంతి యజ్ఞాలు చేశారు. మాతాజీ భక్తులకు మంత్రోపదేశం చేశారు. భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు.

ముగిసిన ఇస్తిమా


ఇస్తిమాకు హాజరైన ముస్లింలు

పాకాల: మండలంలోని ఐటీఐ క్రీడా మైదానంలో రెండు రోజుల ఇస్తిమా కార్యక్రమం ఆదివారం ముగిసింది. ముస్లింలు అనుసరించాల్సిన జీవనశైలి, నడవడిక, అల్లా ప్రబోధించిన మార్గంలో నడడటం, ప్రజలతో ప్రేమానురాగాలతో సహవాసం..ఇత్యాది అంశాలపై ముస్లిం మత గురువులు ధార్మికోపన్యాసం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది ముస్లింలు హాజరయ్యారు.

మాన్యువల్ కౌన్సెలింగ్ ప్లీజ్!

తిరుపతి అర్బన్: ఉపాధ్యాయులుగా ఎంపికైన 2025 డీఎస్సీ అభ్యర్థులకు మాన్యువల్ కౌన్సెలింగ్‌తో ఖాళీలు ఎంపిక చేసుకునే సదుపాయం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు బాలాజీ, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. మాన్యువల్ కౌన్సెలింగ్ విధానంలో మాత్రమే ప్రత్యక్షంగా ఉపాధ్యాయ ఖాళీలను ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుందన్నారు.

గురజాడకు ఘన నివాళి



తిరుపతి కల్చరల్: సంఘసంస్కర్త, అభ్యుదయ కవితా పితామహుడు గురజాడ అప్పారావు 163వ జయంతి సందర్భంగా రాములవారి దక్షిణ మాడ వీధిలోని చిగోరా ఆధ్యాత్మిక సేవా కేంద్రంలో ఆదివారం ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సదాశివం, సేవా కేంద్రం నిర్వాహకుడు చిత్రపు హనుమంతరావు మాట్లాడారు. సమాజంలో మూఢ నమ్మకాలపై గురజాడ చేసిన పోరాటం, అజ్ఞాన నిర్మూలనకు ఆయన చేసిన సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి , భాగవతుల జయలక్ష్మి, మల్లిఖార్జున్, చంద్రమోహన్, సుబ్రమణ్యం, నాగరాజు పాల్గొన్నారు.

యువతకు
పోలీసులు స్వీట్ వార్నింగ్!

తిరుపతి క్రైమ్: నగరంలోని గరుడ ఫ్లై ఓవర్‌పై కేక్ కట్ చేస్తూ సంబరాలు చేసిన వారికి అలిపిరి సీఐ రామకిషోర్ ఆదివారం వేకువజామున కౌన్సెలింగ్ నిర్వహించారు. తిరుపతి అర్ధరాత్రి పూట కొన్ని రోడ్లపై అడపాదడపా బర్త్‌డే వేడుకలు చేసుకోవడం యువతకు ఫ్యాషన్‌గా మారింది. దీనిని పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. ఇలా సంబరాలు చేసుకున్న వారిని గుర్తించి చిన్నపాటి క్లాసు తీసుకున్నారు. మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గరుడ వారధిపై జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ప్రత్యేక సిబ్బందిని నియమించారని, సంబరాలకు పాల్పడితే పోలీస్ స్టేషన్లో వారికి తామే సంబరాలు చేస్తామని స్వీట్ వార్నింగ్ ఇచ్చారు!


యువతీ యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న అలిపిరి సీఐ రామకిషోర్

పిండ తర్పణం.. వసూళ్లే ప్రదానం

కపిలతీర్థానికి ఆదివారం జనం పోటెత్తారు. తమ పెద్దలకు పితృ పిండ తర్పణాలు సమర్పించేందుకు తిరుపతి జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలివచ్చారు. అయితే సంబంధిత అధికారులు సరైన ఏర్పాట్లు కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరో వైపు ఇష్టారాజ్యంగా పురోహితులు వసూళ్లు చేయడంతో దోపిడీకి గురయ్యారు.


తర్పణాలు వదిలేందుకు పూజలకు వచ్చిన భక్తజనంతో కిక్కిరిసిన కపిలతీర్థం ప్రాంగణం

- కపిలతీర్థానికి పోటెత్తిన జనం
- ఏర్పాట్లలో టీటీడీ వైఫల్యం
- ఇష్టారాజ్యంగా పురోహితుల వసూళ్ల పర్వం

తిరుపతి కల్చరల్: ప్రతి ఏటా ఈ మహాలయ అమావాస్య రోజున తమ కుటుంబంలో దోషాట నివారణ, వంశాభివృద్ధి, సుఖశాంతులు లభించాలనే ఉద్దేశంతో కపిలతీర్థంలో పితృదేవతలకు పిండ, తర్పణాలు సమర్పించడం ఆనవాయితీ. ఈ పిండ తర్పణాలు చేసేందుకు కపిలేశ్వర బ్రాహ్మణ తర్పణ పురోహిత సేవా సంఘానికి టీటీడీ, ఫారెస్ట్ అధికారులు అనుమతించారు. జిల్లా నలమూలల నుంచే కాకుండా తమిళనాడు వాసులు కూడా ఆదివారం ఉదయం నుంచి కపిల తీర్థానికి వేలాదిగా రావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు, అలిపిరికి వెళ్లే మార్గం కిక్కిరిసి పోయింది. వచ్చి వెళ్లే వారికి వేర్వేరుగా క్యూలు ఏర్పాట్లు చేయకపోవడంతో జనం ఎటు వెళ్లాలో, ఎటువైపు రావాలో తెలియక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇసుకేస్తే రాలనంత జనం చేరుకోవడం, జనం మధ్య చంటి పిల్లలు ఏడుపు అందుకున్నారు. పితృదేవతలకు పిండాలు, తర్పణాలు వదలడానికి ఉదయం 6 గంటలకు వెళ్లిన వారు 10, 11 గంటలైనా తిరిగి రాలేకపోయినంతగా జనం పోటెత్తడం చూస్తే ఎంతగా ఇబ్బందులు పడ్డారో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

జనం భారీగా తరలి వస్తారని తెలిసినా..!

టీటీడీ అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేయకపోవడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైకుంఠ మహాద్వార దర్శనం సందర్భంగా టోకెన్లు జారీ సమయంలో జరిగిన తొక్కిసలాటను గుర్తుచేసుకుంటూ టీటీడీ తీరుపై మండిపడ్డారు. ఓ వైపు తీవ్ర జనసందడి నడుమే ఎలాగో తర్పణాలు సమర్పించాల్సి వచ్చింది. ఇదే అవకాశంగా పురోహితులు ఇష్టారాజ్యంగా వసూళ్లు చేశారు. పితృదేవతల తర్పణానికి రూ.500, పిండ ప్రదానం కోసం రూ.వెయ్యి నుంచి రూ.5వేల వరకు వసూలు చేశారు. పిండ ప్రదానానికి అవసరమైన సామగ్రి మరో రూ.300. అవి కూడా నాసిరకమైనవే.! ఈ ఇబ్బందులు, వసూళ్లతో అసహనం, ఆందోళన నడుమే వందలాది మంది తర్పణాలు సమర్పించి తిరుగుముఖం పట్టడం కనిపించింది. భారీగా జనం రావడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.


భక్తులను అదుపు చేస్తున్న పోలీసులు

కూటమి సోషల్ మీడియాలో అన్నీ కట్టుకథలే..!

- అవాస్తవాలను తిప్పికొడదాం
- కూటమి వైఫల్యాలను ఎండగడదాం
- వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా సమావేశంలో భూమన అభినయ్‌రెడ్డి పిలుపు


మాట్లాడుతున్న భూమన అభినయ్‌రెడ్డి, సమావేశానికి హాజరైన సోషల్ మీడియా నాయకులు

తిరుపతి మంగళం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అయినా ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చకపోగా అన్నీ చేసేసినట్లు ఎల్లో మీడియాతో పాటు కూటమి సోషల్ మీడియాల్లో కట్టుకథలు చెబుతూ, ప్రజలను మభ్యపెడుతున్నారని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి విమర్శించారు. తిరుపతిలోని ఎంప్లాయీస్ కాలనీ వద్ద ఓ ఫంక్షన్ హాల్లో ఆదివారం వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా సమావేశం నిర్వహించారు. అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ, గత ఐదేళ్ల పాలనలో వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం అహర్నిశలూ శ్రమిస్తే, ఎన్నికల్లో కూటమి నాయకులు వారికి వంతపాడే ఎల్లో మీడియాతో పాటు సోషల్ మీడియాలో జగనన్నపై లేనిపోని దుష్ప్రచారం చేసి, లెక్కలేనన్ని హామీలు గుప్పించి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. హామీలు నెరవేర్చకపోగా పచ్చి అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పెట్టిస్తోందని, కూటమి సోషల్ మీడియాలో వస్తున్న అవాస్తవాలను తిప్పి కొట్టి ప్రజలకు వాస్తవాలను తెలియజేసే దిశగా వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా మరింత చురుగ్గా పనిచేయాలని కోరారు. ఈ క్రమంలో కూటమి నాయకుల్లా దిగజారి దూషణలు చేయాల్సిన అవసరం లేదని, అమర్యాదగా సంబోధించరాదన్నారు. ప్రజాసంక్షేమం, ప్రజాసమస్యల పరిష్కారం దిశగా పోరాటాలు, సోషల్ మీడియాల్లో పోస్టులు ఉండాలని సూచించారు. కూటమి అరాచకాలను పార్టీ శ్రేణులు ఎప్పటికప్పుడు తిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో పార్టీ నగర అధ్యక్షులు మల్లం రవిచంద్రారెడ్డి, సోషల్ మీడియా నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

నవరాత్రులకు సిద్ధమైన శక్తి చాముండేశ్వరి ఆలయం

తిరుపతి రూరల్: మండలంలో తుమ్మలగుంట సమీపంలోని శ్రీశక్తి చాముండేశ్వరి ఆలయం నవరాత్రి ఉత్సవాలకు ధర్మకర్తల మండలి అధ్యక్షులు బిరుదాల భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. సోమవారం నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తారు. తొలిరోజు బాలా త్రిపుర సుందరి దేవిగా దర్శనమిస్తారు.


విద్యుద్దీపాలతో కాంతులీనుతున్న అమ్మవారి ఆలయం

ఓలలాడించిన గాత్ర కచేరి



తిరుపతి కల్చరల్: ఎస్వీ సంగీత, నృత్య కళాశాల అధ్యాపకురాలు చిన్నమదేవి అన్నమయ్య సంకీర్తనల గానంతో శ్రోతలను ఉర్రూతలూగించింది. ఆదివారం సాయంత్రం స్వర్ణభారతి ఆధ్వర్యంలో కేటీ రోడ్డులోని అరవిందో సొసైటీలో సంగీత కచేరి నిర్వహించారు. పలు కీర్తనలను సుమధురంగా గానం చేశారు. ఆమెకు వయోలిన్‌పై ధీరజ్, మృదంగంపై ప్రసన్న వెంకటేష్ సహకారం అందించారు. అనంతరం అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుడు డాక్టర్ కే.సుబ్రమణ్యం అన్నమాచార్య సాహిత్య ప్రచారంలో ప్రముఖుల పాత్ర అనే అంశంపై ఉపన్యసించారు. స్వర్ణభారతి ప్రధాన కార్యదర్శి శరద్యుతి, ఎస్వీ సంగీత కళాశాల వయోలిన్ విభాగాధిపతి డాక్టర్ కేవీ.కృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన సంపదల ప్రదర్శన


ముగింపు సమావేశంలో ఇండియన్ బ్యాంక్ అధికారులు

తిరుపతి కల్చరల్ : స్థానిక కేటీ రోడ్డులోని ఇండియన్ బ్యాంక్ జోనల్ కార్యాలయంలో రెండు రోజుల పాటు ఏర్పాటు చేసిన సంపదల ప్రదర్శన, విక్రయ మేళా ఆదివారం ముగిసింది. ముఖ్య అతిథిగా ఇండియన్ బ్యాంక్ ఫీల్డ్ జనరల్ మేనేజర్ ప్రణేష్‌కుమార్ మాట్లాడారు. ఈ మేళాలో నాన్ పెర్ఫార్మింగ్ ఆస్తుల కింద ఉన్న స్థిరాస్తులను పారదర్శక విధానంతో, సరసమైన ధరలకే వేలం ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ మేళాలో వసతి గృహాలు, వాణిజ్య సముదాయాలు, స్థలాలు వివరాలను కొనుగోలుదారులు ప్రత్యక్షంగా, ఆన్‌లైన్‌లో కూడా తెలుసుకుని సద్వినియోగం చేసుకున్నారని వివరించారు. కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ ఎం.సెల్వరాజ్ పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

- తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 10 నుంచి 2గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, 10.30 నుంచి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్.
- జీవకోనలోని విశ్వం స్కూల్లో ఇంటర్ స్కూల్స్ ఫెస్ట్‌లో భాగంగా ఉదయం 10 గంటల నుంచి చిత్రలేఖనం వక్తృత్వ, జానపద నృత్య, నాటిక పోటీలు.
- కలెక్టరేట్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- స్విమ్స్ శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాలలో ఉదయం 10 గంటలకు ఎంబీబీఎస్ ప్రవేశ విద్యార్థినులకు ఓరియంటేషన్.
- జాతీయ సంస్కృతి విశ్వవిద్యాలయంలో ఉదయం 10 గంటలకు పాఠశాల నుంచి యూనివర్సిటీ స్థాయి విద్యార్థులకు ప్రత్యేక పోటీలు.

నృత్యం..మంత్రముగ్ధం


శాస్త్రీయ నృత్యం చేస్తున్న చెన్నై కళాకారులు

చంద్రగిరి: తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో వారాంతపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం చెన్నైకు చెందిన అమం డివైన్ ఫౌండేషన్ చిన్నారుల శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పలు భక్తిగీతాలు, కీర్తనలకు నిఖిత, పవిత్ర, భావతారణి, సాయినందిని, మాళవిక, కారుణ్య, సుభిష, లలితశ్రీ, ఐశ్వర్య, దీక్ష తమ అభినయం, హావభావాలతో ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశారు.

స్వామి సేవకు వాహనాలు సిద్ధం


వాహనాలను శుద్ధి చేస్తున్న వేద పాఠశాల విద్యార్థులు


గరుడ వాహనాన్ని శుభ్రం చేస్తున్న ఆలయ సిబ్బంది

తిరుపతి రూరల్: తుమ్మలగుంటలో శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో స్వామి వారి సేవలకు వావాహనాలను సిద్ధం చేశారు. అలంకార మండపంతో పాటు వాహనాలను సుగంధ ద్రవ్యాలతో శుభ్రం చేశారు. గ్రామంలోని వీధులన్నీ రంగు రంగుల విద్యుత్తు దీపాలతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు ఆదివారం పూర్తి చేశారు. ఆలయ వ్యవస్థాపక కమిటీ సభ్యులు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, ఆలయ సిబ్బందితో పర్యవేక్షించారు

రేపు బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

బ్రహ్మోత్సవాలకు మంగళవారం సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు అంకురార్పణ నిర్వహిస్తారు. గ్రామంలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం నుంచి పుట్టమన్ను తీసుకువచ్చి ప్రధాన ఆలయం వద్దనున్న యాగశాలలో నవధాన్యాలను మట్టి కుండల్లో పోసి ఈ కార్యక్రమాన్ని వేద పండితులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు.

అలరించిన ‘దుర్యోధన వధ’

రామచంద్రాపురం: మండలంలోని నూతి కుంటపల్లెలో నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాలు ఆదివారం దుర్యోధనవధ ఘట్టంతో ముగిశాయి. దుర్యోధన, భీమసేన వేషధారులు రోషావేశాలతో కలియబడుతూ తమ ప్రదర్శనతో రక్తి కట్టించారు. వధ ఘట్టం ముగిసిన అనంతరం భక్తులు దుర్యోధన ప్రతిమ మట్టి కోసం ఎగబడ్డారు.రాత్రి భక్తులు ఉపవాస దీక్షలతో అగ్నిగుండం ప్రవేశం చేసి మొక్కులు చెల్లించారు.అనుపల్లె, కొత్త వేపకుప్పం, గంగుడుపల్లె గ్రామ ప్రజల సహకారంతో ఉత్సవాలు విజయవంతం చేసినట్టు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, నిర్వాహకులు తెలిపారు.


తలపడుతున్న భీముడు, దుర్యోధన వేషధారులు

చెలరేగిపోతున్న గ్రావెల్ మాఫియా

అక్రమార్కులకు కల్పవృక్షంగా మారిన పత్తిగుట్ట


పత్తిగుట్టలో మట్టిని తవ్వేస్తున్న జేసీబీ

చంద్రగిరి: కూటమి ప్రభుత్వ పాలనలో గ్రావెల్ మాఫియా చెలరేగిపోతోంది. పట్టణంలోని పత్తిగుట్టను ఏడాదిన్నరగా కొల్లగొడుతూ జేబులు నింపుకుంటున్నారు. ఆదివారం జేసీబీల సాయంతో గుట్టను తవ్వేసి, అక్రమంగా గ్రావెల్ రవాణా చేశారు. ఉదయం నుంచి పట్టణంలో గ్రావెల్ లోడుతో ట్రాక్టర్లు వెళ్తున్నా, సాక్షాత్తు పోలీసు స్టేషన్ ముందే వెళ్తున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. మరోవైపు ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నా సంబంధిత అధికారులు ఇప్పుడు ప్రేక్షక పాత్ర వహించడం, గ్రావెల్ బకాసురులపై చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. వాస్తవానికి గతంలో ఇదే ప్రాంతంలో గ్రావెల్ అక్రమ రవాణాను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు, బోర్డును సైతం ఏర్పాటు చేశారు. అయితే బోర్డును తొలగించి మరీ గ్రావెల్ మాఫియా అక్రమ రవాణాకు బరితెగించిందంటే ఇక్కడ ఏ స్థాయిలో రెచ్చిపోతున్నారో, వారికెవరి అండదండలున్నాయో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. దీనికి ఉన్నతాధికారులైనా చెక్ పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ముందస్తు జాగ్రత్తలతో మతిమరుపు దూరం


వైద్య శిబిరంలో మాజీ ఎమ్మెల్యే రెడ్డివారి రాజశేఖర్‌రెడ్డికి రక్తపోటు పరీక్ష చేస్తున్న వెంగమ్మ

చంద్రగిరి: ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే ‘మతిమరుపు’ దరిచేరదని శ్రీదేవరాజ్ యువర్స్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ వైస్ చాన్సలర్ డాక్టర్ బి.వెంగమ్మ అన్నారు. మండలంలోని నరసింగాపురంలోని రెడ్డివారి నాదమునిరెడ్డి మెమోరియల్ జెడ్పీ హైస్కూల్లో ఆదివారం వయోవృద్ధులకు చిత్త వైకల్య (డెమెన్షియా స్క్రీనింగ్ క్యాంప్) ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దీనికి మంచి స్పందన లభించింది. డాక్టర్ వెంగమ్మ మాట్లాడుతూ, తాను మూడు దశాబ్దాల పాటు స్విమ్స్‌లో సేవలందించానని, ప్రస్తుతం మరో సంస్థలో వీసీగా ఉన్న తాను చిత్త వైకల్య బాధితులకు సేవలు అందించడానికి మాజీ ఎమ్మెల్యే రెడ్డివారి రాజశేఖర్‌రెడ్డి, రెడ్డివారి భార్గవి రెడ్డిని సంప్రదించినట్లు తెలిపారు. ఇకపై ప్రతి నెలా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మతిమరుపు రావడానికి కారణాలు, అనర్థాలు, డెమిన్షియా బారి నుంచి బయటపడేందుకు చేయవలసిన వ్యాయామం ..ఇత్యాది వాటిపై ఆమె అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు ప్రవీణ్ రెడ్డి, వర్ష, అవినాష్, ఆకాంక్ష, రోషిణి రెడ్డి, రసూల్ రెడ్డి, ప్రనేష్, హర్షిణి, వైద్య సిబ్బంది బొబ్బి, సాత్విక్, సుమిత్, మాజీ ఎంపీటీసీ రాజేంద్రప్రసాద్ రెడ్డి (పెదబాబు), కొత్తపాటి ఈశ్వర్ రెడ్డి, కొత్తపాటి మాధవరెడ్డి. మాజీ సర్పంచ్ బాలసుబ్రమణ్యం, సింగిల్ విండో డైరెక్టర్ రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణతో దోపిడీకి దారులు

- పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం
- కూటమి ప్రభుత్వంపై ఎస్ఎఫ్ఐ మండిపాటు


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్న కుమార్

తిరుపతి సిటీ: ప్రభుత్వం తీసుకున్న పీపీపీ విధానం నిర్ణయంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, బలహీన వర్గాల విద్యార్థులకు వైద్య విద్య దూరమవుతోందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్న కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశం తిరుపతిలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, వైద్య విద్యను ప్రైవేట్ పరం చేయడం అన్యాయమని, ప్రభుత్వమే మెడికల్ కాలేజీలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. పీపీపీ రూపంలో కూటమి ప్రభుత్వం మెడికల్ సీట్ల బహిరంగ దోపిడీకి దారులు తెరిచిందని, బడాబాబులకు అప్పజెప్పడమేనని దుయ్య పట్టారు. ప్రభుత్వ నిర్ణయం మారకపోతే ఉన్నత వర్గాలకే వైద్య విద్య పరిమితమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, రవి మాట్లాడారు. జిల్లాలోని ప్రభుత్వ హాస్టళ్లు, పాలిటెక్నిక్ కళాశాల హాస్టల్ సమస్యలు తీవ్రంగా ఉన్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వినోద్, తేజ, సహాయ కార్యదర్శులు వీరేష్, ఉమేష్, రమణ, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్, రవీంద్ర, సిద్ధార్థ్ తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీలను దగా చేస్తున్న కూటమి ప్రభుత్వం

–ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ నేత నాగేశ్వరరావు


మాట్లాడుతున్న నాగేశ్వరరావు

తిరుపతి కల్చరల్: కూటమి ప్రభుత్వం సామాజిక న్యాయం కేవలం ప్రకటనలు, ఊకదంపుడు మాటలకే పరిమితమై ఓబీసీలను దగా చేస్తోందని ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు నాగేశ్వరరావు విమర్శించారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం భూతద్దంలో చూపే సామాజిక న్యాయం ఆచరణలో కనిపించడం లేదని, కేవలం కమ్మ, కాపు వర్గాలకే ప్రాధాన్యతనిస్తూ బీసీ, ఓబీసీలపై వివక్ష చూపుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో ఇటీవల వివిధ దేవాలయాల చైర్మన్ల నియామకంలో ఓబీసీలకు స్థానం లేకపోవడమే దీనికి నిదర్శనమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 42 శాతం స్థానిక ఎన్నికలలో రిజర్వేషన్లు ప్రకటిస్తే రాష్ట్రంలో మాత్రం 34 శాతం మాత్రమే బీసీలకు కేటాయిస్తామని చెప్పడం శోచనీయమన్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం స్పందించి బోయకొండ గంగమ్మ, అన్నవరం సింహాచలం తదితర దేవస్థాన చైర్మన్ పదవులను బీసీలకు ఇవ్వాలని లేని పక్షంలో గుణపాఠం చెప్పక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విజయ ఉత్తరాది, జిల్లా అధ్యక్షుడు వెంకట్ యాదవ్, మహేష్, రాంప్రసాద్, పవన్, శివాజీ నాయక్, దివాకర్ పాల్గొన్నారు.

స్థలాల పేరిట మోసం!

- రూ.2.70కోట్లు వసూలు మకాం మార్చిన దంపతులు
- న్యాయం చేయాలని బాధితుల నివేదన


సమావేశంలో మాట్లాడుతున్న బాధితురాలు గీత

తిరుపతి కల్చరల్: స్థలాలు ఇప్పిస్తామంటూ తమ వద్ద లక్షల రూపాయలు తీసుకుని మోసం చేశారని, దీనిపై ప్రశ్నిస్తే దాడులు చేస్తున్నారని సాయినగర్‌కు చెందిన గీత, జ్యోతి తమ గోడు నివేదించారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సాయినగర్‌లో నివాసమున్న ఉమామహేశ్వరి, చంద్రబాబు దంపతులు తమకు ముళ్లపూడి వద్ద రెండు ఎకరాల భూమి ఉందని, దానికి విక్రయిస్తామని నమ్మించి తమ వద్ద నుంచి లక్షల రూపాయాలు తీసుకున్నారని తెలిపారు. తమతో పాటు సాయినగర్‌లోని 18 మంది నుంచి రూ.10 లక్షల నుంచి 25 లక్షల వరకు సుమారు 2.70 కోట్లు డబ్బులు వసూలు చేసి స్థలాలు ఇవ్వలేదని వాపోయారు. తాము ఇచ్చిన డబ్బు తిరిగి ఇవ్వాలని కోరితే దౌర్జన్యం చేశారని, దీనిపై అలిపిరి, ఎంఆర్ పల్లి పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమను మోసం చేసిన ఆ దంపతులు మకాం మార్చి ప్రస్తుతం ఆటోనగర్‌లో నివాసమున్నారని, చివరకు అక్కడి వెళ్లి తమ డబ్బులు ఇవ్వాలని కోరినా తమపై వారు దాడి చేయడమేకాక కేసులు పెట్టారని వాపోయారు. తమను దగా చేసిన దంపతులపై చర్యలు తీసుకుని సంబంధిత అధికారులు ఇకనైనా న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బాధితులు మోనిక, జమీల, నాగలక్ష్మి పాల్గొన్నారు.